www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 9 ఆగస్టు 2024

5

తూర్పుగోదావరి



నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ఆర్ట్సు కాలేజ్ నుంచి కంబాల చెరువు వరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులతో ఈ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్థానిక బొమ్మూరులోని జిల్లా కలెక్టర్‌కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పొగాకు సాగుకు రెక్కలు

- ఎకరా కౌలు రూ.85,000
- అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన డిమాండ్
- కౌలు రైతులపై ఆర్థిక భారం



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంతర్జాతీయ మార్కెట్లో పొగాకుకు డిమాండ్ పెరగడంతో జిల్లాలో పొగాకు సాగుకు రెక్కలొచ్చాయి. గతంలో ఎన్నడూ ఊహించని విధంగా పొగాకు ధరలు పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కిలో రూ.369 వరకూ విక్రయాలు జరిగాయి. ఈ నేపథ్యంలో సాగుకు కౌలు ధరలు, బేరన్‌లీజు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. భూముల కౌలు, బ్యారన్ లీజులు, లైసెన్సు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో సాగు చేసే రైతులలో పెట్టుబడి ఖర్చులపై ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది ధరలతో పోల్చుకుంటే, 2024-2025 ధరలు రెట్టింపు కావడంతో కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో సాధ్యమైనంత ముందుగా భూములను కౌలుకు తీసుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గత రెండేళ్లుగా పెరిగిన సాగు విస్తీర్ణం

గత రెండేళ్లుగా జిల్లాలో పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలోని మూడు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 50 వేల ఎకరాల్లో సాగుకు పొగాకు బోర్డు 2023-2024లో అనుమతి ఇచ్చింది. అదనంగా మరో 20 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేసినట్లు అంచనా. 49 మిలియన్ కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా 67 మిలియన్ కిలోల ఉత్పత్తి అయింది. 2024-2025లో మరో 20 వేల ఎకరాల్లో అదనంగా పొగాకు సాగు జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో జీడిమామిడి, మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలను తొలగించి పొగాకు సాగుకు భూములు సిద్ధం చేస్తున్నారు. ఎకరం భూమి కౌలు రూ.70 వేల నుంచి రూ.85 వేల వరకూ వసూలు జరుగుతోంది. సాధారణంగా ఎకరా కొబ్బరి తోటపై రూ.30,000, జీడిమామిడి తోటపై రూ.20,000, ఆయిల్ పామ్ పంటపై రూ.50,000 మించి ఆదాయం లభించే అవకాశం లేదు. అదే భూములను కౌలుకు ఇస్తే ఎకరా రూ.85,000 ఆదాయం రావటంతో రైతులు తోటలను తొలగించి పొగాకుసాగుకు కౌలుకు ఇస్తున్నారు.

ఈ నేపథ్యంలో సాగు పెంచేందుకు ఇప్పటి నుండి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో జీడిమామిడి, మామిడి, కొబ్బరి తోటలను తొలగించి పొగాకు సిద్ధం చేస్తున్నారు. ఎకరా కొబ్బరి తోటపై రూ.30 వేలు జీడిమామిడి తోటపై రూ.30 వేలు అయిల్ పామ్ వంటపై రూ.30 వేలకు మించి ఆదాయం రావడం లేదని, అదే భూములను పొగాకు కౌలుకు ఇస్తే మంచి ఆదాయం వస్తోందని రైతులు లెక్కలు కడుతున్నారు.

కౌలు రైతులపై మరింత భారం

మార్కెట్లో పొగాకు ధర అనూహ్యంగా పెరగడంతో బ్యారన్ లైసెన్సు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ఏడాది బ్యారన్ లైసెన్సు పస్తుతం రెట్టింపుపైగా పెరిగి ఏకంగా రూ.8.10 లక్షలు పలుకుతోంది. మున్ముందు ధర రూ.10 లక్షలకు చేరుకుంటుందని రైతులు బావిస్తున్నారు. గత ఏడాది బ్యారన్ లీజు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకూ ఉంది. తాజాగా రూ.2.50 లక్షలకు చేరిందని రైతులు చెబుతున్నారు. కౌలు రైతులు అత్యధిక మంది పొగాకు సాగు చేస్తున్నారు. తాజా ధరలు కౌలు రైతులపై మరింత భారం పెంచాయి,

సంవత్సరం	కౌలుధరలు(రూ.లో)	బ్యారన్ లీజులు(రూ.లో)	లైసెన్సు ధరలు(రూ.లో)
2022-23	25.000-30,000	60,000-65,000	2.60.000
2223-24	35.000-42.000	60,000-70,000	4,00,000
2024-25	50.000-85.000	2.50,000	8,10.000

పలు పనులకు మంత్రి దుర్గేష్ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, పెరవలి

రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గురువారం మండలంలోని పాలంగి, కె.సావరం, చివటం, వడ్లూరు, సూర్యారావుపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఉపాధి అభివద్ధి పనులలో భాగంగా ఆయా గ్రామాల్లో ఆయన సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో మాట్లాడారు. నిడదవోలు నియోజకవర్గాన్ని అభివద్ధి వైపు పయనింపజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరింత అభివద్ధి వైపు త్వరలోనే పరుగులు పెట్టిస్తానన్నారు. కూటమి పార్టీల అధినేతలు రహదారుల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, పాలంగి సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, తదితర నాయకులు తమ గ్రామంలో రిజర్వ్ స్థలంలో వాటర్ ట్యాంక్ వద్ద పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు, మండల, గ్రామ అధికారులు పాల్గొన్నారు.

పెరవలి మండలం కానూరు అగ్రహారం నడిపల్లి, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. కానూరులో రూ.69.9 లక్షలు, కానూరు అగ్రహారంలో రూ.15 లక్షలు నడిపల్లిలో రూ.49 లక్షలు, తీపర్రులో రూ.13 లక్షలు, ఉసులుమర్రులో రూ.15 లక్షల వ్యయంతో రోడ్లు నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భావన మధు పూర్ణచంద్, కోటిపల్లి శ్రీదేవి, వీరమల్లు నాగలక్ష్మి, ఎంపికటిసి హరిదాసు సుబ్బారావు, పిప్పర రవికుమార్, అతికాల శ్రీను, రవి వర్మ, హనుమంతు సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ హిమామహేశ్వరి, ఎఇ ఏడుకొండలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి దుర్గేష్

పొగాకు పంటలో నియంత్రణ పాటించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

పొగాకు మార్కెట్లో ఒడిదుడుకులు ఉంటాయని, రైతులు ఈ ఏడాది లాభాలను చూసి వచ్చే సీజన్‌కు భారీగా పొగాకు సాగు చేయకుండా నియంత్రణ పాటించాలని గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్ కుమార్ సూచించారు. గురువారం గోపాలపురం పొగాకు బోర్డును ఆయన సందర్శించారు. పొగాకు వేలం కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. పొగాకు నాణ్యత గురించి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 9.8 మిలియన్ కేజీల పంట కొనుగోలుకు అనుమతి ఇవ్వగా, రైతులు అదనంగా 12.2 మిలియన్ కేజీలు పంట పండించినట్టు అంచనా వేశామన్నారు. బోర్డు సూచించిన పరిమితి దాటి అదనంగా పండించిన పంటకు పెనాల్టీ విధించరాదని రైతుల అభ్యర్థన మేరకు ఈ ఏడాది అధిక తుపాను వల్ల పంట నష్టం వాటిల్లడంతో అవన్నీ పరిగణలో తీసుకొని రాజమహేంద్రం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, టుబాకో బోర్డ్ ఇడి అద్దంకి శ్రీధర్ బాబు సహకారంతో ఈ ఏడాదికి పెనాల్టీ లేకుండా కొనుగోళ్లు జరపాలని అనుమతులు లభించినట్లు తెలిపారు. టుబాకో బోర్డు రీజనల్ మేనేజర్ జిఎల్‌కె.ప్రసాద్, వేలం నిర్వహణాధికారి అమూల్ డి.శామ్, ఇల్లూరి రాంబాబు, పిన్నమనేని మధుమోహన్, పరిమి జగదీష్, మాజీ బోర్డు వైస్ చైర్మన్ గద్దె శేషగిరిరావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, కొర్లపాటి అన్నవరం, నందమూరి సత్యనారాయణ, దుగ్గిరాల రాంబాబు, వల్లభనేని సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.



పొగాకు బోర్డును పరిశీలిస్తున్న చైర్మన్ సిహెచ్.యశ్వంత్ కుమార్

సాహిత్యంలో 'చెళ్లపిళ్ల'ది అజరామర కీర్తి

ప్రజాశక్తి-కడియం

తెలుగు సాహిత్యంలో ఎన్నటికీ తిరుపతి వేంకట కవులు అజరామరులేనని శ్రీ చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తిరుపతి కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి 154వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని జంట కవుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటకాలు, పద్యాలు, గ్రంథాలు, అవధానం రచనల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి చెళ్లపిళ్ల అని కొనియాడారు. హైస్కూల్ హెచ్ఎం టి.సత్యనారాయణ, డాక్టర్ దేవరపు నీలకంఠ రావు, గొల్లపల్లి సత్యనారాయణ, కర్రి రాజు, కె.రవి బాబు, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, కొత్తూరి కృష్ణ, డిటివిఎస్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శిశువు కోసం విచారణ

ప్రజాశక్తి-రాజానగరం

తనకు పుట్టిన ఆడ బిడ్డను నాలుగేళ్ల క్రితం స్థానిక ఎఎన్ఎం సాయంతో కొందరు తీసుకుని వెళ్లిపోయారని తూర్పుగానుగూడెం గ్రామానికి చెందిన కర్రాపు ఆదిలక్ష్మి, అప్పారావు దంపతులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐసిడిఎస్ పీడీ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టారు. బాధితులు, ఎఎన్ఎంను విచారించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులను విచారిస్తున్న పీడీ విజయలక్ష్మి

దాత వీరభద్రరావు మృతి

ప్రజాశక్తి-తాళ్లపూడి



అడిగిన వెంటనే లేదనకుండా సహాయ సహకారాలు అందిస్తూ దాతగా పేరుగాంచిన కంకిపాటి వీరభద్ర రావు (84) గురువారం మృతి చెందారు. వీరభద్రరావు ఎరువులు, సిమెంట్ వ్యాపారం నిర్వహిస్తూ రైతులకు ఎంతో సాయంగా ఉండేవారు. సుమారు 50 ఏళ్లుగా ఆయన దుకాణం వద్ద ప్రజలకు తాగునీరు అందించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

దేవరపల్లి ఎస్ఐగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- దేవరపల్లి

దేవరపల్లి నూతన ఎస్ఐగా సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తాడేపల్లిగూడెంలో ట్రాఫిక్ విభాగం నుంచి దేవరపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీహరి బదిలీపై కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-పెరవలి

కానూరులో గత ప్రభుత్వ హయాంలో 318 మంది లబ్ధిదారులకు జగనన్న లే ఔట్‌లో ఇచ్చిన స్థలాల్లో నేటికీ అరకొర వసతులే ఉన్నాయని బిఎస్‌పి నియోజకవర్గ కన్వీనర్ వెన్నపు సుధాకర్ మంత్రి దుర్గేష్‌కు గురువారం వినతిపత్రం అందించారు. డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, రోడ్ల సదుపాయాలు లేక ఇంటి నిర్మాణం చేపట్టాలంటే లబ్ధిదారులు బెంబేలెత్తి పోతున్నారని తెలిపారు.

భారీ వర్షంతో జలమయం

ప్రజాశక్తి-తాళ్లపూడి, గోపాలపురం

తాళ్లపూడి మండల పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. సుమారు నాలుగు గంటల పాటు కురిసిన వర్షంతో తాళ్లపూడి మెయిన్ బజార్‌తో పాటు వేగేశ్వరపురం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమం అయ్యాయి. పలు గ్రామాల్లోని వీధులు చెరువుల్లా మారాయి.



తాళ్లపూడిలో జలమయమైన మెయిన్ బజార్

సాగిపాడు, దొండపూడికి రాకపోకలు నిషేధం



గోపాలపురం మండలం దొండపూడి రోడ్డుపై రాకపోకలు నిలిపివేసిన అధికారులు

గోపాలపురం కొవ్వాడ రిజర్వాయర్ డ్యామ్ నుంచి గేట్లు ఎత్తివేయడంతో నీటి ప్రవాహం అధికంగా వచ్చింది. మండలంలోని సాగిపాడు, దొండపూడి గ్రామాలకు రాకపోకలు నిషేధించినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఇరిగేషన్ ఎఇ ఎం.రాహుల్ భాస్కర్ మాట్లాడుతూ పోలవరం మండల పరిధిలోని కొవ్వాడ రిజర్వాయర్ డ్యాం గరిష్ఠ ఎత్తు 90.50 మీటర్లు నీటిని నిలువ చేసే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. కురుస్తున్న వర్షాలకు కొండల మీద నుంచి వస్తున్న నీరు ఉధృతంగా వస్తుండడంతో గురువారం 90.30 మీటర్లు ఎత్తుకు వచ్చిందన్నారు. దీంతో డ్యామ్ మూడు గేట్లను ఉదయం 5 గంటల నుండి ఎత్తినట్లు తెలిపారు. రిజర్వాయర్‌లో నీరు 88.50 మీటర్ల ఎత్తు వరకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. దీంతో గోపాలపురం మండలంలోని సాగిపాడు, దొండపూడి గ్రామాల్లో రెండు చోట్ల ఆర్ అండ్ బి రోడ్ల పైనుంచి వరద నీరు ఉధతంగా పొంగి ప్రవహిస్తోంది. ఎస్ఐ సతీష్ కుమార్, రెవెన్యూ అధికారులు ఆ రెండు చోట్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

జెండా పండుగను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఇంటింటా జెండా పండుగను ఆగస్ట్ 13 నుంచి 15 వరకూ జాతీయ భావాన్ని పెంచేలా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 9 నుంచీ 15 వరకూ వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలతో పాటు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులని భాగస్వామ్యం చేస్తూ, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ర్యాలీ నిర్వహించే విషయంలో జాతీయ భావం పెంపొందించేలాగా కార్యక్రమాలు నిర్వహణ ఉండాలన్నారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని తెలిపారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా తిరంగా యాత్రలు, తిరంగా కచేరీలు, తిరంగా ప్రతిజ్ఞ, తిరంగా కాన్వాస్‌తో పాటు అనుమతించిన తిరంగా ప్రతి చోటా ప్రదర్శించాలన్నారు. ఆగస్ట్ 13 నుంచి 15 వరకూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేసి సెల్ఫీ తీసుకుని వెబ్ సైట్‌లో అప్లోడ్ చెయ్యాలని పిలుపు నిచ్చారు. పిఎం విశ్వ కర్మ యోజన పథకం కింద చేతి వృత్తులు, కులవృత్తులు చేసుకునే వారిని గుర్తించి, వారి పేర్లు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ లాగిన్‌లో తిరస్కరించిన వాటిని తిరిగి నమోదుకు ఆస్కారం లేదని, మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన వారినే నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పని దినాలు కల్పించి, తద్వారా మెటీరియల్ కాంపోనెంట్ సమకూర్చుకుని గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టడం సాధ్యం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ 100 రోజుల పనిదినాలు కల్పించేలా, లేబర్ షెడ్స్ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనిదినాలు మరింత పెరిగేలా, స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. దినసరి సగటు వేతనం రూ.250గా కాక రూ.290 ఉండే విధంగా పనుల గుర్తింపు చెయ్యాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.ముఖలింగం, డిపిఒ డి.రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డి బాలశంకర రావు, డిఆర్‌డిఎ పీడీ ఎంవివిఎస్.మూర్తి, డిపిఒ నాగలత తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన నవ దంపతులు

ప్రజాశక్తి-రాజానగరం

నూతన వధూవరులు రక్షణ కోసం రాజానగరం పోలీసులను గురువారం ఆశ్రయించారు. మండలంలో చక్రద్వరబంధం గ్రామానికి చెందిన నాగవరపు శివాజీ, సూర్యారావుపేటకు చెందిన అత్తిలి సాయి కుసుమ ప్రేమించుకున్నారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో వారు పెళ్లి చేసుకున్నారు. మరునాడు ఉదయం రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించారు. వధూవరులను ఏమైనా ఇబ్బంది పెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వారి తల్లిదండ్రులకు పోలీసులు తెలిపారు.

'సినిమా చెట్టు' పునరుజ్జీవానికి చర్యలు

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కుమారదేవం గ్రామంలో ఇటీవల కుప్ప కూలిన సినిమా చెట్టును పునరుజ్జీవంపజేసేందుకు రోటరీ క్లబ్ సభ్యులు నడుం కట్టారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ఉదయకిరణ్ మాట్లాడుతూ ముందుగా చెట్టు వేళ్ల ద్వారా రసాయనాలు పంపించి శాస్త్రీయ విధానంలో చెట్టు నిలబెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ఈ ప్రణాళిక పూర్తికావడానికి సుమారు 45 నుంచి 60 రోజులపడుతుందన్నారు. చెట్టు యథాతథ స్థితికి సంభందించిన పనులు పూర్తిస్థాయిలో చేపడతామని తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

చెట్టును పరిశీలించిన దర్శకుడు వంశీ

కూలిన సినిమా చెట్టును పరిశీలించడానికి సినీ దర్శకుడు వంశీ వచ్చారు. ఆ ప్రాంతంతో తనకు ఉన్న అనుబంధాన్ని గ్రామస్తులతో కలిసి గుర్తు చేసుకున్నారు. తాను సినిమాలను గోదావరి ఒడ్డున షూటింగ్ చేస్తే కచ్చితంగా ఈ చెట్టు కింద సీన్‌లు తీసేవాడినని తెలిపారు. ఇప్పటివరకు తాను తీసిన 22 చిత్రాల్లో 18 చిత్రాలు ఈ సినిమా చెట్టుక్రింద ఏదో ఒక సీన్ తీసినట్టు తెలిపారు.

మహేష్ బాబు అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సినీ హీరో మహేష్ బాబు 49వ పుట్టిన రోజు సందర్భంగా గురువారం జక్కంపూడి రామ్మోహనరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ చొల్లంగి సత్యగిరి పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి - నిడదవోలు

తల్లిపాల వారోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా నిడదవోలు వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ రావు మాట్లాడారు. తల్లిపాలు చాలా శిశువులకు బలవర్ధకమైనవని తెలిపారు. ఐసిడిఎస్ పీడీ కె.విజయ్ కుమారి మాట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లల్లో ఐక్యూ లెవెల్స్ అధికంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ తేజశ్రీ మాట్లాడారు. రంగా వెంకటేశ్వరరావు 20 మంది గర్భవతులకు చీరలు, జాకెట్ పువ్వులు, గాజులు, డ్రై ఫ్రూట్స్ పళ్లు పంపిణీ చేశారు. ఒక్కక్కరికీ రూ.వెయ్యి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నీలం రామారావు, జాస్తి వెంకటరావు, గంగుల వెంకటలక్ష్మి, బేతన వెంకట్ రామన్, బండి రాంగోపాల్, బండి వెంకటేశ్వరావు, శ్రీలక్ష్మి, సిహెచ్.లక్ష్మి, పి.నళిని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -దేవరపల్లి, పెరవలి

మరమ్మతు పనులు జరుగుతున్న కారణముగా శుక్రవారం దేవరపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని బంధపురం, రామన్నపాలెం, బుచ్చియ్యపాలెం, దేచర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖాధికారి బి.వీరభద్రరావు తెలిపారు. పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మల్లేశ్వరం, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, పిట్టల వేమవరం, అన్నవరప్పాడు, కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు నడుపల్లి తదితర గ్రామాల నివాసాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఇఇ బి.వీరభద్రరావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు.

ఉప్పలపాటి సుబ్బారావు మృతి

ప్రజాశక్తి-పెరవలి

ఉసులుమర్రుకు చెందిన ఉప్పలపాటి సుబ్బారావు (102) గురువారం మృతి చెందారు. సుబ్బారావుకు నలుగురు కుమార్తెలు, కుమారుడు సత్తిరాజు టిడిపి సీనియర్ నాయకుడు. మనవులు 11 మంది, మునిమనవలు 18 మంది ఉన్నారు. గ్రామానికి మంచినీటి సౌకర్యం లేని సమయంలో ఈయన చొరవ తీసుకుని మంచినీటి చెరువు తవ్వించి ప్రజల దాహార్తి తీర్చి మన్ననలు పొందారు. మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

కార్టూన్ 'నిజం'



నువ్ కట్టిన డబ్బులు జిఎస్‌టికి సరిపోయాయయ్యా... అసలు ప్రీమియం సొమ్ములు చెల్లించాలి మరి..!!

ప్రశాంతంగా స్కూల్ కమిటీల ఎన్నికలు

జిల్లావ్యాప్తంగా స్కూల్ యాజమాన్య కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా సాగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం నాగరాజా ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయని హెచ్ఎం మోటూరి మంగారాణి తెలిపారు. చైర్మన్‌గా ఆర్.వెంకట సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా ఎన్.రమ్య ఎన్నికైనట్టు మంగారాణి తెలిపారు. **దేవరపల్లి** మండలంలో మొత్తం 45 పాఠశాలలోనూ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఎఇలు ఎం.తిరుమల దాసు, కెఆర్ఎస్‌వివి.అప్పారావు తెలిపారు. **కడియం** మండలంలో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయని ఎంఇఒలు పేర్కొన్నారు. **సీతానగరం** మండల వ్యాప్తంగా పాఠశాలల్లో ఎంఇఒ స్వామి నాయక్ ఆధ్వర్యంలో విద్యా యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. **గోపాలపురం** గోపాలపురం మండలంలోని 53 స్కూల్స్‌కు సంబంధించి స్కూల్ కాంప్లెక్స్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు తెలిపారు. **చాగల్లు** మండలంలో ఆయా పాఠశాల్లో హెచ్ఎం ఆధ్వర్యంలో స్కూల్ పిల్లల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహించారు. **పెరవలి** మండలం మల్లేశ్వరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా గూడపాటి కనకదుర్గ, వైస్ చైర్మన్ వసంతవాడ చిన్నారిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోటిపల్లి మురళీకృష్ణ, మేడిచర్ల భాస్కర్ శివకుమార్, కోటిపల్లి శ్రీనివాస్, వేమన సాయి, రంగనీడి సుబ్బారావు, పోతు మారుతి, వసంతవాడ దొరబాబు పాల్గొన్నారు.



పెరవలి విద్యా కమిటీ ఎన్నికల్లో పాల్గొన్న నాయకులు

పలు మండలాలకు నూతన తహశీల్దార్ల నియామకం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించిన తహశీల్దార్లను వివుడ్జ్ పోస్టుల్లో నియమిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో పరిపాలనాధికారిగా పిహెచ్‌జిఆర్.పాపారావు, పరిపాలన విభాగం సూపరింటెండెంట్‌గా జిఎల్ఎస్.దేవిలను నియమించారు. భూముల విభాగం సూపరింటెండెంట్‌గా ఎమ్‌డి.మగ్సూద్‌అలీ, రాజమహేంద్రవరం ఆర్‌డిఒ కార్యాలయం డివిజనల్ పరిపాలన అధికారిగా ఎం.సుజాత, బిక్కవోలు తహశీల్దార్‌గా డబ్ల్యూఎల్ రమణి, కోరుకొండ తహశీల్దార్‌గా వి.సుస్వాగతం, గోకవరం తహసీల్దార్‌గా వై.సరస్వతి, కడియం తహశీల్దార్‌గా కె.పోసిబాబు, రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్‌గా జెవిఆర్.రమేష్ నియమితులయ్యారు. కొవ్వూరు డివిజన్‌లో సబ్ కలెక్టర్, కొవ్వూరు కార్యాలయం డివిజనల్ పరిపాలన అధికారిగా జిఎస్ఎస్.జవహర్‌బాజీ, చాగల్లు తహశీల్దార్‌గా మెరికమ్మ మెరిపె, నిడదవోలుకు బి.నాగరాజునాయక్, పెరవలికి డి.అచ్యుతకుమారి, తాళ్లపూడికి బి.రవీంద్రనాథ్, కొవ్వూరుకు జి.కనకరాజు, ఉండ్రాజవరానికి పిఎన్‌డి.ప్రసాద్ తహశీల్దార్లుగా నియమితులయ్యారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రత్యేక తహశీల్దార్‌గా(కెఆర్‌ఆర్‌సి) ఎం.రామకృష్ణను నియమించారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలిని ఢీకొన్న బస్సు

ప్రజాశక్తి - కరప

కరప పాతమార్కెట్ సెంటర్ వద్ద ఆర్‌టిసి బస్సు వృద్ధురాలిని ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని సహపురం గ్రామానికి చెందిన బుద్ధాల నూకరత్నం పనుల నిమిత్తం కరప గ్రామం వచ్చింది. కరప మెయిన్ రోడ్డు కాంగ్రేగుల వెళ్లే జంక్షన్ వద్ద ఆ వృద్ధురాలిని ఆర్‌టిసి బస్సు ఢీకొట్టి కాళ్లపై నుంచి వెళ్లింది. దీంతో ఆమె రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో చికిత్స నిమిత్తం స్థానికులు, పోలీసులు 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - గోకవరం

పేకాట శిబిరాలపై పోలీసులు గురువారం దాడి చేసి 14 మందిపై కేసులు నమోదు చేశారు. గుమ్మళ్లదొడ్డి, కొత్తపల్లి గ్రామాల్లో పేకాడుతున్నారని అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ పవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. గుమ్మళ్లదొడ్డిలో 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.76,500 నగదు, స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంలపై హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,400 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పేకాడుతున్న అయిదుగు అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం అద్దంపల్లి గ్రామంలోని ఎస్‌సి కాలనీలో బుంగ రాజు ఇంటి పక్క ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ జానీ బాషా గురువారం తెలిపారు. వారి వద్ద రూ.7,150 లు నగదు, 216 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జల్ జీవన్ మిషన్ సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆగస్టు 9 నుంచీ 13 వరకూ ఇంటింటా జల్ జీవన్ మిషన్ సర్వే చేపట్టి ప్రతి ఇంటికీ అందచేస్తున్న తాగునీరు సరఫరా, ట్యాప్ కనెక్షన్, వాహనాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న నీరు సక్రమంగా అందుతున్నాదా లేదా వంటి సమగ్ర సమాచారం సేకరణ చెయ్యాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సర్వేతో శానిటేషన్ సర్వే కూడా సమాంతరంగా చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం శానిటేషన్ నిర్వహణా తీరును రెండూ గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తామనిపేర్కొన్నారు. ఎస్‌డబ్ల్యుపిఎస్ షెడ్స్ నూరు శాతం పనిచేసేలా ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 66 చోట్ల ఎస్‌డబ్ల్యుపిఎస్ షెడ్స్ పని చెయ్యడం లేదని, తక్షణం అవి పని చేసేలా చూడాలన్నారు. పెండింగ్ పన్నుల బకాయిలు వసూలు చేయాలన్నారు. ట్యాక్స్ కనెక్షన్లు మరింత వేగవంతం చేయాలని, ఆస్తులపై పన్నులు వేస్తామని తెలిపారు. పన్నుల విధానంపై ఎటువంటి మినహాయింపులూ ఉండవని స్పష్టం చేశారు. ఘన వ్యర్థాల నుంచి సంపద సష్టి కేంద్రాలు డంపింగ్ యార్డ్‌లు కాదని, అక్కడ పారిశుధ్య నిర్వహణ వ్యవస్థ లేకపోవడం గుర్తిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.ముఖలింగం, డిపిఒ డి.రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డి.బాలశంకర రావు, డిఆర్‌డిఎ పీడీ ఎంవివిఎస్.మూర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి నాగలత, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌గా జగనన్న లే అవుట్

ప్రజాశక్తి - సీతానగరం

గహనిర్మాణ శాఖ డిఇ రఘుదేవపురంలో సుద్దమెట్ట వద్ద జగనన్న ఇళ్ళ స్థలాల లే అవుట్‌ను గురువారం పరిశీలించారు. సుద్దమెట్ట వద్ద లబ్దిదారులకు అందించాల్సిన 41 ఎకరాల 81 సెంట్ల భూమిలో డంపింగ్ యార్డ్‌గా గత ఇరవై రోజుల్లో వేసిన చెత్తను పరిశీలించారు. పంచాయతీ చర్యలపై డిఇ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1687 మంది లబ్దిదారులకు పట్టాలు అందజేసి భూమి చూపించకుండా రెవిన్యూ అధికారులు వదిలేశారు.


వైసిపి కార్యాలయంలో పిల్లి బోస్ పుట్టినరోజు వేడుకలు

రాజ్యసభ సభ్యులు బోస్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- రామచంద్రపురం

పట్టణ వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గ వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

వైశ్య సంఘం అధ్యక్షునిగా 'నంబూరి'

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ నూతన అధ్యక్షునిగా నంబూరి సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా, నంబూరి నరేష్ కోశాధికారిగా కొమ్మూరి వెంకటాచల ప్రసాద్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ళ జనార్ధన రావు కళ్యాణ మండపంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. నంబూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ త్వరలో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైశ్య సంఘ, ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ధ్వంసం

ప్రజాశక్తి - కోటనందూరు


మండలంలో రోడ్డుపై ఇనుక చక్రాలతో వెళ్తున్న దమ్ము ట్రాక్టర్

కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు నిర్లక్ష్యంతో ధ్వంసం అవుతున్నాయి. ఖరీఫ్ సాగు నేపథ్యంలో వరి పొలాలు దమ్ము చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. గతంలో ఎద్దులకు నాగలి కట్టి దమ్ము చేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుత ఆధునిక కాలంలో పొలాల్లో దమ్ము చేసేందుకు ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. రైతులకు సమయం కలిసివస్తుందనే కారణంతో రైతులు వీటిపైనే మొగ్గు చూపుతున్నారు.కొందరు రైతులు సొంత ట్రాక్టర్లను వినియోగిస్తుంటే, మరికొన్ని ఇతరుల నుంచి అద్దె ప్రాతిపదికన రప్పించి దమ్ము చేయించడం జరుగుతోంది. దమ్ము చేసే సమయంలో ట్రాక్టర్లకు ఉండే టైర్లను తొలగించి ఇనుముతో తయారు చేసిన చక్రాలను వినియోగిస్తారు. ప్రారంభంలో ఇనుము చక్రాలను పొలంలోకి దిగే ముందు బిగించి దమ్ము చేసేవారు. రోడ్డు మీదకు వచ్చేటప్పుడు టైర్లను బిగించుకుని వచ్చే పరిస్థితి ఉండేది. ఎందుకంటే రోడ్డుపై ఇనుప చక్రాలతో వస్తే రోడ్డు ధ్వంసం అవుతాయని, అలా చేస్తే ఆర్ అండ్ బి అధికారులు జరిమానాలు వేసే పరిస్థితి ఉండేది. అయితే ప్రస్తుతం ట్రాక్టర్లను వినియోగిస్తున్న కొందరు రైతులతోపాటు, డ్రైవర్లు నిర్లక్ష్యం, సంబంధిత శాఖ అధికారులు అలసత్వం వెరసి రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ఇప్పటికే గత ఐదేళ్ల పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోకుండా రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్లు అన్నీ గోతులమయంగా మారిపోయాయి. ఎక్కడ గొయ్య ఉందో ఎక్కడ సాఫీగా ఉందో తెలియని రీతిలో రోడ్లు ఉన్నాయి. ఆ గోతుల్లో పడి అనేక మంది ప్రమాదాలకు గురౌతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యాయి. దమ్ము ట్రాక్టర్ల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇనుప చక్రాలతో రోడ్లపైకి వచ్చి మరింతగా రోడ్లను చిద్రం చేస్తున్నారు. మండలంలో 17 గ్రామపంచాయతీలోనూ ఇదే పరిస్థితి నెలకుందని స్థానికులు చెబుతున్నారు. దమ్ము చక్రాలతో రోడ్లను ధ్వంసం చేస్తున్నారని ఆర్ అండ్ బి, రెవెన్యూ, పోలీసు శాఖకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి శాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేసి రోడ్లపై తిరిగే దమ్ము ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, తద్వారా రోడ్లను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

12 నుంచి14 వరకూ శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు మండల పరిషత్ సమావేశపు హాలులో శిక్షణ ఇస్తున్నట్లు ఎండిఒ జి.ఉషారాణి తెలిపారు. రిసోర్స్ పర్సన్స్ సుభాని, ఎ.భారతి ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణా తరగతుల్లో పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం పాలనా విధులు, తప్పనిసరి విధులు, ఐచ్ఛిక విధులు వంటి అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. అలాగే ఈ విధుల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీల అధికారుల పాత్ర, సమావేశాలు, గ్రామ సభల నిర్వహణ, పర్యవేక్షణ తనిఖీలు, ప్రజారోగ్యం, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, తడి - పొడి చెత్తల సేకరణ, కంపోస్టు తయారీ, మార్కెటింగ్, 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు వంటి అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు.

గ్రామంలో ప్రవేశించిన నీరు

ప్రజాశక్తి - గండేపల్లి


ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న చంటిబాబు

మండలంలోని జడ్.రాగంపేట గ్రామంలోని బావి చెట్టు చెరువు నిండి కలింగుల మీదుగా నీరు గ్రామంలోకి ప్రవేశించింది. దీంతో గ్రామ సర్పంచ్ కందుల చిట్టిబాబు గ్రామంలోకి వచ్చిన నీరు త్వరితగతిన బయటకు వెళ్లేందుకు వీలుగా ప్రొక్లయినర్‌తో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడికను తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా వర్షాల సమయంలో నీలాద్రిరావుపేటకు చెందిన రాంభద్రయ్య చెరువు, సీతారాంపురంలోని చెరువులు నిండిన తరువాత తమ గ్రామంలోని చెరువు నిండుకుటుందన్నారు. అనంతరం కలింగల ద్వారా పంట కాలువ మీదుగా బయటకు పోతాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, రాంబాబు, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఎంఎల్ఎ పంతం నానాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వికలాంగులకు సంబంధించిన ఉపకరణాలకు సంబంధించిన కొలతలు తీసుకున్నారు. శిబిరానికి వచ్చిన వారికి భోజన వసతిని ఎంఎల్ఎ కల్పించారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఎంఎల్ఎ అభినందించారు.

ముంపు నీరు పోయేందుకు చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు స్పందించి ముంపు నీరు బయటకు పోయేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక పంచాయతీ జల్లావారి పేటలో ముంపు నీరు అధికంగా ఉండడంతో యంత్రాల సహాయంతో తాత్కాలిక డ్రెయినేజీ ఏర్పాటు చేసి నీరు బయటకు పోయేలా చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి బాబు, పంచాయతీ కార్యదర్శి నున్న శంకర్ నారాయణ, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం



బుద్ధదేవ్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం ఘనంగా నివాళులర్పించింది. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, చల్లా విశ్వనాథం, దారపురెడ్డి సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, దారపురెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

గంజాయి సమాచారం తెలిపిన వారికి రూ.5 వేల బహుమతి: మంత్రి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గం తో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కడైనా గంజాయి సమాచారం తెలిపిన వారికి రూ.5వేలు బహుమతి ఇస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. ఆయన గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఫ్యాక్టరీస్ వద్ద, స్కూళ్లు, కళాశాలల వద్ద, పబ్లిక్ ప్రదేశాల్లో ఎక్కడైనా సరే గంజాయి అమ్మిన సేవించిన వారి సమాచారం వెంటనే మంత్రి సుభాష్‌కి, నియోజకవర్గ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం తెలిపిన వారికి ఈ సమాచారం తెలియజేసిన వారికి రూ.5 వేలు రివార్డుగా అందజేస్తామన్నారు. వివరాలు తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతారన్నారు. . రాష్ట్రంలో మాదకు ద్రవ్యాలు గంజాయి పూర్తిగా అరికట్టాలన్నారు. దీనికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన తెలిపారు.

9న యూత్ మారథాన్

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో యూత్ ఫెస్ట్ (మారథాన్,క్విజ్) నిర్వహించడానికి మార్గదర్శకాలు రూపొందించినట్లు జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టిబి.నియంత్రణ అధికారి సిహెచ్ వి భరత లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈనెల 9న యూత్ మారథాన్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీ క్విజ్ గణన పాల్గొనడానికి డ్రిల్ మాస్టర్లు నియమించి విద్యార్థిని, విద్యా ర్థులను పంపవలసిందిగా కోరామన్నారు. ఈ ర్యాలీని భట్నవిల్లి వద్ద జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు ప్రారంభిస్తారని తెలి పారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

వైద్య శిబిరాలను పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటి పిలుపునిచ్చింది. మండలంలోని అన్నంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోర్టు వారి ఆదేశాల మేరకు గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు మరియు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి వచ్చిన రోగులను డాక్టర్ మణి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బార్ ప్రెసిడెంట్ సత్యనారాయణ మాట్లాడారు. ఈ శిబిరంలో సచివాలయం సెక్రెటరీ భవాని, 104 వాహనం డిఇఒ విజయ్, ఎంఎల్‌హెచ్ పి.అనిల్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - కాకినాడ


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలోని పలు ముంపు ప్రాంతాలను నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం పరిశీలించారు. ఉదయం ఐదున్నర గంటల నుంచే కమిషనర్ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాలు, రహదారులపై వర్షం నీరు లేకుండా చూడాలన్నారు. ఆనందభారతి, మెయిన్‌రోడ్లలో వర్షం నీరు నిలిచిపోవడాన్ని గమనించారు. ముంపు నీరు ఎలా బయటకు వెళుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్ అవుట్ లెట్స్ వరకూ అన్ని చోట్లా శుభ్రం చేయాలని సూచించారు. నగర శివారు ప్రాంతాలపైనా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈదురుగాలు, వర్షాలకు కూలిన చెట్ల తొలగింపును వెంటనే చేపట్టి నగరవాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ పర్యటనలో ఎంహెచ్‌ఒ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జ్యోతిర్మయి

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మహారాణి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి అన్నారు. గురువారం స్థానిక మహారాణి కళాశాలలో 'మాదకద్రవ్యాల వినియోగం - విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం' అనే అంశంపై ప్రిన్సిపల్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది తమ లాభాల కోసం విద్యార్థులకు మాదకద్రవ్యాలను అలవాటు చేస్తున్నారన్నారు. ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తు శూన్యంగా మారుతుందన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు భళ్లమూడి సూర్య నారాయణ మూర్తి మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు చెడు ప్రభావాలకు లోనుకాకుండా ఈ మాదకద్రవ్యాల దరిదాపులకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో, క్రమశిక్షణతో చదువు కొనసాగించాలన్నారు. టొబాకో అండ్ యాంటీ డ్రగ్స్ నోడల్ ఆఫీసర్ ఎఎస్.సత్య నారాయణమూర్తి, కళాశాల అధ్యాపకులు డి.గంగాధరుడు మాట్లాడారు.

విన్యాసాల ద్వారా విపత్తుల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ


సమావేశంలో మాట్లాడుతున్న లావణ్య

విపత్తులు సంభవించినప్పుడు సమర్ధవంతంగా రెస్క్యూ కార్యకలాపాలు నిర్వహించేలా జిల్లాలో ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహించనున్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రోజెక్ట్ మేనేజర్ ఎం.లావణ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం కమాండర్ మన్మోహన్ యాదవ్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రాబోయే 20 రోజుల్లో విపత్తుల నివారణా చర్యల మీద, విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, విపత్తుల తరువాత జరిగే పరిణామాలను ఎదుర్కునే నైపుణ్యాలపై ప్రజలకు, విద్యార్థులకు, ఆసుపత్రి సిబ్బందికి, రసాయన ఫ్యాక్టరీల సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించనున్నారని తెలిపారు. ఇందుకోసం విజయవాడ నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం రావడం జరిగిందన్నారు. జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతలకు సంబంధించి 6 మండలాలలో ఫెమెక్స్ విపత్తు నిర్వహణ విన్యాసాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో లైజింగ్ అధికారి జగదీష్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ను ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.

జీవితంలో వ్యాయామం భాగం కావాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రతిఒక్కరూ తమ జీవితంలో వ్యాయామం ఒక భాగంగా చేసుకోవాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అన్నారు. గురువారం జీజీహెచ్ ప్రాంగణంలో ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులు ఏర్పాటు చేసిన అవగాహనా ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్య విద్యార్థులు వ్యాయామం ఆవశ్యకత వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డా.లావణ్య కుమారి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో ఎవరూ శారీరక కష్టం లేకుండా జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ అనిత, ఫిజియోథెరఫి హెచ్ఒడి డాక్టర్ లకమన సాయినాథ్, ఆర్థో వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా నైపుణ్య కమిటీ అధికారులు స్థానికంగా లభించే కొబ్బరి, ఆక్వా ముడి ఉత్పత్తులను విలువ ఆధారితంగా మార్చే రంగంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం కలెక్టర్, కమిటీ ఛైర్మన్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ దూర ప్రాంతాలకు పంపడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆ విధంగా కాకుండా స్థానికంగా లభించే ముడి సరుకు ఆధారంగా విలువ ఆధారిత రంగాల్లో నైపుణ్యత పెంపొందించే దిశగా స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ద్వారా శిక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో మండల వారీగా 18-45 మధ్య వయసు గల నిరుద్యోగ యువత ను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-అంబాజీపేట

ఖరీఫ్ లో ఎరువుల యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. పి.గన్నవరం ఎడిఎ ఎస్.జె.వి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఖరీఫ్ పంటలు, ఎరువుల యాజమాన్యం ప్రధాన పోషకాలు అయిన నత్రజని భాస్వరం, పొటాష్, ఎరువులు సూటి రూపంలో వాడితే ఖర్చు తగ్గుతుందని అన్నారు.ఇరుసుమండలో వ్యవసాయ శాఖాధికారి సిహెచ్ డి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొని రైతులు నత్రజని ఎరువు మూడు దఫాలుగా, భాస్వరం ఎరువు దుక్కిలో ఒకేసారి పటాస్ రెండు దఫాలుగా వాడాలని సూచించారు. కోకోనట్ ఫార్మర్స్ సిఇఒ గోపాలకష్ణ రసాయనిక ఎరువులతో పాటు పచ్చిరొట్ట, కంపోస్ట్ వాడకం వలన సేంద్రియాల కర్బనం పెరిగి సూక్ష్మ పోషకాలు పంటకు అందుతాయన్నారు. జీవన ఎరువుపై పోస్ఫో బ్యాక్టీరియా వాడుకోవాలని ఏఓ సూచించారు.

యానాం వార్తలు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

సమస్యలపై గళమెత్తిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

యానంలో అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అసెంబ్లీలో గళమెత్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శాశ్వత వైద్యులు లేక ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని వాపోయారు. తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. 1996లో సంభవించిన భారీ తుపాను వల్ల పక్కా ఇల్లు నిర్మాణానికి రూ.35 వేలు మంజూరు చేశారని, ప్రస్తుతం ఆ గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించేందుకు రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి స్పందించి నిధులు కేటాయించాలని కోరారు. యానంలో నిరుపేదలు సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులకు పరిష్కారం చూపాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గండేపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం కావాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు, గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చెలగల్ల దొరబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంతం మనమే అభివృద్ధి చేసుకోవడం సాధ్యమని, అందుకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని సూచించారు. సాగు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, వంటి ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల ద్వారా ఆయన తెలుసుకున్నారు. ఈ సమావేశానికి రాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపిడిఒ హనుమంతరావుకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వారి గ్రామాల్లో నెలకున్న సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు, వైస్ ఎంపిపికుంచే రాజా, కందుల చిట్టిబాబు, తహశీల్దార్ చిరంజీవి, జాస్తి వసంత్, అడబాల ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - పెదపూడి

అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కేతా తులసి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపిడిఒ ఆశా జ్యోతి, వైస్ ఎంపిపిలు కరెడ్ల వెంకన్నబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.